తుపాకీ రాజ్యం

జనవరి 1. కొత్త సంవత్సరం తొలిదినం. చలికాలం మధ్యాహ్నం వెచ్చటి ఎండలో నిజామాబాద్ జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలోని 'లాన్స్'లో శ్రీ రఘువీర్ ప్రసాద్ మీనాగారు వాలుకుర్చీలో ఆసీనులయి ఉన్నారు. వారి ఎదుట మరి కొన్ని కుర్చీలున్నాయి. నిజామాబాద్ మునిసిపల్ ఛైర్మను, ఇద్దరు ముగ్గురు కాంట్రాక్టర్లు కూర్చొని ఉన్నారు. మరికొంత దూరంలో జిల్లాకు చెందిన అమీన్‌సాబ్‌లూ సర్కిల్‌సాబ్‌లూ డి ఎస్ పి దొరలూ అటూ ఇటూ పచార్లు చేస్తున్నారు. గుంపులు గుంపులుగా నిలబడి కబుర్లు చెప్పుకుంటున్నారు. తమను ఆశ్రయించిన వాళ్ళ కోరికలు తీర్చడానికి కావలసిన అధికారసమృద్ధి చేతిలోవున్న అదృష్టవంతుల దర్పం వాళ్ళ నవ్వులో ఉంది. అందరి చేతులలోనూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపే రంగురంగుల కేక్‌లు ఉన్నాయి. ఒక్కొక్కరూ మీనాగారికి వాటిని అందిస్తున్నారు. మీనాగారు ఒక చిన్నముక్క నైవేద్యం చేసి మిగిలింది అందరికీ ప్రసాదం పంచుతున్నారు. కేక్ రుచి చూస్తూ ఎడతెరిపి లేకుండ మాట్లాడుతున్నారు. వారి ఆలోచనలకు వారధిలేదు. అభిప్రాయాలకు పరిధిలేదు. ఆత్మవిశ్వాసానికి అవధులు లేవు. శాంతి భద్రతలే కాదు, రాజకీయాలు, పరిపాలనా వ్యవస్థ, మతం, కులం, పత్రికా రంగం- అన్నిటి గురించీ వారు ముచ్చటిస్తున్నారు. ధారావాహికంగా అభిప్రాయాలు చెప్తున్నారు. ప్రస్తుత వ్యవస్థలో ఈ రంగాలను నిర్వహిస్తున్నవారంతా అసమర్థులు అవినీతిపరులు. వాటినన్నింటినీ పోలీసులకు అప్పజెప్పేస్తే ప్రపంచం హాయిగా, ప్రశాంతంగా ఉంటుంది. ఇదీ వారి ప్రసంగం సారాంశం. అమీన్‌సాబ్‌లూ సర్కిల్ సాబ్‌లూ డి ఎస్ పి దొరలూ ఆరాధనపూర్వకంగా ఊఁ కొడుతున్నారు.

అదే వూళ్లో జిల్లా కలెక్టరు ఒకడున్నాడు. వారికీ ఒక కార్యాలయం, కార్యాలయానికి ఆవరణ, ఆవరణలో 'లాన్స్' ఉన్నాయి. కానీ వారెందుకో వెచ్చటి ఎండలోకాక చలికి ముడుచుకుపోయిన గదిలో ట్యూబ్‌లైట్ వెలుగులో కూర్చున్నారు వారూ వారి సి. సి. తప్ప కార్యాలయంలో వేరెవ్వరూ లేరు (వారికి భార్యాపిల్లలు అసలే లేనట్టున్నారు). వారి మాటలకు అడుగడుగునా బ్రేకులే. వారికి మాటలు రావనికాదు. నిజానికి వారు మీనాకంటే 'ప్రతిభావంతులే'. ఐ ఎ ఎస్ గట్టెక్కారు కదా! మీనాలాగ క్రింది మెట్టుదగ్గర ఆగిపోలేదు. వారూ పలు విషయాల గురించి

అనర్గళంగానే మాట్లాడగలదు. కానీ పాపం మొదలుపెట్టిన ఉత్తరక్షణం ఆత్మ సంశయం వహిస్తుంది. వాక్యమధ్యంలో మాటలాగిపోతాయి. కళ్ళల్లో మీనా తళుక్కుమంటాడు. తనకు వుందని ఎదుటివారు భావించే అధికారం నిజంగా లేదని తెలిసిన అసమర్థుని సంకటస్థితి ఇది.

ఈ దృశ్యాలలో ఆ యిద్దరు వ్యక్తుల ప్రత్యేక వ్యక్తిత్వాల ప్రతిబింబం కొంత లేకపోలేదు. కానీ ఇది ప్రధానంగా ఈనాటి దౌర్భాగ్య స్థితికి అద్దంపట్టే చిత్రం. రాజకీయ నాయకులు హత్యలుచేసి అధికారంలోకి వచ్చి, మరికొన్ని హత్యలు చేసి అధికారం నిలుపుకుంటున్నారు. వాళ్ళ అధికారానికి భరోసాలేదు. కాబట్టి ఉన్నంత కాలం తామూ తమవారూ వేగంగా సంపాదించుకొని రాజీవుడు తలచిననాడు దిగి పోవాలి. సంపాదనకు తప్ప వేరేదేనికీ వాళ్ళకు టైంలేదు. వాళ్ళ ముఠా ప్రయోజనాలే తప్ప వేరే రాజకీయం లేదు. పాలకవర్గాల దీర్ఘకాల ప్రయోజనాలను గురించికూడ వాళ్ళు ఆలోచించడం లేదు. దానిని మార్కెట్‌లో పెట్టుబడికీ బయట గుండాలకూ పోలీసులకూ వదిలేసారు. ఈ పరిపాలనా వ్యూహంలో ప్రపంచ బ్యాంకుకూ సుధీర్ కుమార్‌కూ రఘువీర్ ప్రసాద్ మీనాకూ చోటుండిగానీ అభివృద్ధి, సంక్షేమం, చట్ట బద్ధపాలన మొదలయిన వాదనలకు చోటెక్కడిది ?

'పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చేసాం' అని సిగ్గొదిలిపెట్టి గర్వంగా ప్రక టించాడు నేదురుమిల్లి జనార్ధనరెడ్డి (ఆయన జీవిత చరిత్ర తెలిసినవాళ్ళు ఆయనకు ఇంకా సిగ్గు మిగిలివుందని భావించరనుకోండి.) పోలీసులు ఒళ్ళు విరుచుకొని లేచారు. చెన్నారెడ్డి 'త్రిసూత్రపథకం' ఎత్తుగడవల్ల తొమ్మిది నెలలు కొంత విరా మం తీసుకొని వాళ్ళు బలం పుంజుకొనివున్నారు మీటింగ్‌లకూ ఊరేగింపులకూ తిరిగిన వాళ్ళ లిస్టులు తయారుచేసుకొని వున్నారు. భూములు దున్నుతున్న ఊళ్ళలో మొదట నాగలికట్టిన వాళ్ళ పేర్లు రాసుకొనివున్నారు. ప్రజాకోర్టులలో ఉత్సాహంగా పాల్గొన్నవారి జాబితా సేకరించి వున్నారు. వాళ్ళకు తోడుగా ఢిల్లీ అనుమతితో ఇండోటిబెటన్ బోర్డర్ ఫోర్స్ బెటాలియన్ ఒకటి దిగుమతి అయింది. ఇండియాకు టిబెట్‌కూ సరిహద్దు మహబూబ్‌నగర్‌లో ఆదిలాబాద్‌లో కరీంనగర్‌లో ఉందని వాళ్లు కనుక్కొని అక్కడ స్థిరపడ్డారు. స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అనే స్టెన్‌గన్ రాక్షసముఠాకు తోడుగా స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ అనే సుశిక్షిత సాయుధ ముఠా

ఒకటి తయారయింది. తెలుగుజాతినేత ఎన్టీఆర్ గ్రేహౌండ్స్ అనే పేరుతో తర్ఫీదు మొదలుపెట్టిన ఈ సైన్యానికి చెన్నారెడ్డి ఏలికలో ఈ కొత్తపేరు పెట్టి తర్ఫీదు పూర్తి చేసారు. ఇప్పుడు వీళ్ళందరినీ జనంమీదికి వదిలారు. వీళ్ళు విడివిడిగానూ ఉమ్మడిగానూ జనాన్ని చంపుతున్నారు.

నర్మెట్ట, అచ్చంపేట, చిట్యాల, గజ్వేల్ సంఘటనలను విడివిడిగా చర్చిస్తూ రాడికల్స్ ఏవో తొందరపాటు చర్యలకు పాల్పడ్డారని అందరం విమర్శించాముగానీ అన్నిటినీ కలిపి చూస్తే వాటిలో ప్రభుత్వ సంకల్పమే ప్రధానంగా కనిపిస్తుంది. ఒకప్పుడు 'వ్యక్తిగత హింసను వదిలిపెట్టి ప్రజలను సమీకరించి ప్రజా ఉద్యమాలు నిర్వహించవచ్చును కదా' అని సవాలు చేసారు. ప్రజాబలం లేక తుపాకులు పట్టుకున్నారని ఎద్దేవా చేసారు. అవకాశం ఇస్తాం, చేతనయితే ప్రజలను సమీకరించి పోరాడండి అన్నారు. నాయకులు ఉపన్యాసాలు ఇచ్చారు, పత్రికలు సంపాదకీయాలు రాసాయి. తొమ్మిది నెలలు గడిచాయో లేదో ఇకచాలని అందరికీ అనిపించింది. ఒకప్పటి సవాలును వాళ్ళే మరచిపోయారు. త్రిసూత్ర పథకాన్ని అమలుచేయకుండానే అది విఫలం అయిపోయిందని అందరూ అంగీకరించారు. ఇక అణచివేయండి, అణచివేయండి, అని ప్రభుత్వాన్ని గెచ్చగొట్టారు. ప్రభుత్వం సై అనింది. 'ప్రజా పోరాటాలు నిర్వహించరాదా' అని హేళన చేసినవారు ఒక్కొక్క ప్రజా పోరాట రూపంమీదా తుపాకులు ఎక్కుపెట్టి అణచివేతను ప్రకటించారు. నర్మెట్టలో ధర్నా, అచ్చంపేటలో బహిరంగసభ, చిట్యాలలో రాస్తారోకో, గజ్వేల్‌లో ఊరేగింపు-అన్నీ ప్రజాపోరాట రూపాలే. అన్నిటి మీదా తుపాకులు ఎక్కుపెట్టారు. 'ఇకచాలు, ఉద్యమాలు నిర్వహించడం మానుకోండి' అనేది ఈ దాడుల సందేశం. కిడ్నాప్‌లు చేస్తున్నారనేది, బలవంతంగా లారీలను తరలిస్తున్నారనేది, బెదిరించి చందాలు వసూలు చేస్తున్నారనేది సాకులు మాత్రమే. అవే కారణాలయితే దేశవ్యాప్తంగా మతకల్లోలాలను రెచ్చగొట్టి గత సంవత్సరం చివరి మూడు నెలలలో 690కి పైగా హత్యలకు కారణమయిన భారతీయ జనతా పార్టీకి, రాష్ట్రంలో ప్రతిరోజూ పరస్పర హత్యాకాండకు పాల్పడుతున్న కాంగ్రెస్-తెలుగుదేశం పార్టీలకూ, చెన్నారెడ్డిని గద్దె దించడం కోసం దాదాపు 300 మందిని చంపించిన జనార్దనరెడ్డి-సుధీర్‌కుమార్ ముఠాకు, ఏ ప్రజాస్వామిక హక్కులూ ఉండవు.

ఆ తరువాత వరసగా ఎన్‌కౌంటర్లు ప్రారంభమయ్యాయి. అడ్డతీగల దగ్గర

జడేరులో జరిగిన కాల్పులు తప్ప తక్కినవన్నీ బూటకపు ఎదురుకాల్పులే. ఆచ్చంపేట మీటింగ్‌కు పోస్టర్లు అంటిస్తూవున్న కృష్ణారెడ్డిని మహబూబ్‌నగర్ జిల్లా గౌరిదేవిపల్లిలో స్పెషల్ స్ట్రైయికింగ్ ఫోర్స్ పోలీసులు గోడకు నిలబెట్టి కాల్చేసి 'ఎన్‌కౌంటర్' జరిగిందన్నారు. పార్టీ చేత బహిష్కరించబడ్డ బాలన్ననూ ఎన్నడూ ఏ రాజకీయాలూ ఎరగని యాదగిరినీ పండుకున్న మంచెమీడి నుండి లేపి తీసుకుపోయి కాల్చేసారు. నిజామాబాద్ జిల్లా మోస్రా గ్రామంలో మీనా పోలీసులు. రవీంద్రఖనిలో పనిచేసుకుంటూ వుండి పోలీసుల దాడులకు భయపడి చాందా పారిపోయి అక్కడ వృత్తి చేసుకుంటూ ఉండిన మంతెన సారయ్యను వెంటాడి అరెస్టుచేసి అందుగుల పల్లికి తీసుకొచ్చి కాల్చేసి 'ఎన్‌కౌంటర్' జరిగిపోయిందన్నాడు రామగుండం ఎస్.ఐ. బ్రహ్మానందం. మంచిర్యాలలో ఒక సాయంత్రం దొరికిన జనరక్షణ కార్యకర్తలు దేవిడ్ ఆనంద్‌లను తెల్లవారుజామున మందమర్రి దారిలో రోడ్డు పక్కన కాల్చేసి కందిచేనులో ఎదురుకాల్పులయ్యాయన్నారు బెల్లంపల్లి అడిషనల్ ఎస్.పి. మహేందర్ రెడ్డి పోలీసులు. భువనగిరి సిపో విజయకుమార్‌ను ఊరి నుండి నాలుగు కిలోమీటర్లు దూరం కాంగ్రెస్ మునిసిపల్ కౌన్సిలర్ మనుషులు తరమగా అక్కడ చుట్టుముట్టి వరిచేనులో కాల్చేసి ఆ బురదలోనే పండుకొని తపంచాతో తమమీద హత్యా ప్రయత్నం చేసాడని ప్రకటించారు నల్గొండ జిల్లాలో జె. వి. రాయుడు బంట్లు. ఇది రాస్తూండగా ఇంకా 'ఎన్‌కౌంటర్లు' అవుతూనే ఉన్నాయి. సిర్పూర్‌లో, మంథనిలో, దేవాపూర్‌లో, మంచిర్యాలలో ఈ వారం రోజులలో 'ఎన్‌కౌంటర్లు' జరిగాయి.

తుపాకీ రాజ్యానికి 'శిలాన్యాసం' చేసి ప్రజలమీద నిత్యం దాడులకు పాల్పడుతూ, తామే నక్సలైట్లమీద 'తుపాకీరాజ్యం' అనే డ్రామా తయారుచేసి ప్రజల డబ్బుతోనే ఆడిస్తున్నారు రాష్ట్ర పోలీసులు. శభాష్! అనక ఏమంటాం. పోలీసులకు రాజకీయ నాటకాలు వేయించే అధికారం ఎవరిచ్చారని అడగడం అనవసరం. అసలు రాజకీయమంతా పోలీసుల ద్వారానే నడుస్తున్నప్పుడు నాటకాలు మాత్రం ఎందుకు వేయించకూడదు? ఎవరికి ఇష్టమున్నా లేకపోయినా రాష్ట్రంలో ఇవ్వాళ విప్లవోద్యమం ఒక ప్రధాన రాజకీయ శక్తి. దానిని పోలీసులకు అప్పజెప్పేసాం అని ముఖ్యమంత్రి ప్రకటించగలిగినప్పుడు, అందులో తప్పేమీలేదని మేధావులూ పత్రికా సంపాదకులూ అనుకోగలిగినప్పుడు, నాటకాల దగ్గర బెట్టెందుకు? సురభి కళాకారులకు ఇన్నాళ్ళకు ఒక రాజకీయ పాత్ర దొరికిందని సంతోషిద్దాం. ఏ రాజ

కియాలూ లేనట్టు నటించే కంటే ప్రజా వ్యతిరేక రాజకీయాలలో బహిరంగంగా పాల్గొనడం ఉత్తమమే.

ఒక్క సురభి కళాకారులకే కాదు, ఎవ్వరికీ తమ రాజకీయ పాత్రను ఎంచు కోకుండ వుండే అవకాశం లేకుండ చేసింది ఈ తుపాకీ రాజ్యం. ఒక్కొక్కరి అసలు రంగూ బయటపడుతూ వుంది. బుద్ధి జీవులనే తీసుకోండి. అందరికీ నీతి బోధించడంలోనూ తమ బోధలకు తామే మురిసిపోవడంలోనూ వాళ్ళకు వాళ్ళేసాటి. అయినా, భూసంస్కరణలను నలభై ఏళ్ళలో అమలు చేయలేని ప్రభుత్వం, వాటిని తామే అమలు చేసుకుంటూన్న రైతు కూలీలను వేల సంఖ్యలో అరెస్టుచేసి జైలుపాలు చేస్తూంటే ఒక్కరూ నోరు మెదపడం లేదు. ఈ అన్యాయాన్ని గురించి ఎవ్వరూ మాట్లాడకుండ ఉంటే జరగవలసింది చల్లగా జరిగిపోతుందని కళ్ళు గట్టిగా మూసు కొని కూర్చున్నారు. నక్సలైట్ల హింసను తిడుతూ రెండురోజులకొక బరువయిన సంపాదకీయం క్రమం తప్పకుండ రాసేవాళ్లు, హత్యలు చేయించి అధికారానికొచ్చిన నేదురుమిల్లి ముఠాకు రాష్ట్రాన్ని ఏలే అర్హతలేదని గొంతు విప్పి అనలేకుండ ఉన్నారు. వాళ్ళను గౌరవనీయులయిన ప్రజాప్రతినిధులుగా సంబోధిస్తూ ఆత్మవంచన చేసుకుంటున్నారు. వాళ్ళలో ఒకడిని పరిపాలనాదక్షుడనీ ఒకడిని రాజకీయ చతురు డనీ ఒకడిని అనుభవజ్ఞుడనీ పొగుడుతున్నారు కూడ. వాళ్ళ హత్యాకాండ 'ప్రస్తుత రాజకీయాలలో సర్వత్రా పెరిగిపోతున్న అవాంఛనీయ ధోరణి' మాత్రమే, నేరంకాదు. అయోధ్య ఉద్యమానికి అడ్డం వచ్చిన వాళ్ళ కాళ్లూ చేతులూ నరుకుతాం అని ప్రక టించిన వెంకయ్యనాయుడుగారి నిత్య పత్రికా గోష్ఠులతో సగం పేజీ నింపుతూ, హింసచేసే వాళ్ళకు ప్రచారం ఇవ్వొద్దని తెలంగాణా జిల్లాల గ్రామీణ విలేకర్లకు ఆదేశాలు పంపుతున్నారు. 'హింస' అనేది ప్రజా రాజకీయాలపట్ల తమకున్న వ్యతి రేకతకు ఒక సాకు మాత్రమేనన్న వాస్తవాన్ని ఇన్నాళ్ళు దాచుకోగలిగారు. ఇవ్వాళ ఆ అవకాశం లేకుండ పాలకవర్గ పార్టీలన్నీ పరోక్షంగానే కాక ప్రత్యక్షంగానూ హింసకు దిగేసరికి పత్రికాధిపతులకూ ఇతర పెద్ద మనుషులకూ ముఖం ఎక్కడ దాచుకోవాలో తెలియడం లేదు. ఇది ఈ మూడు నెలల చరిత్రలోని అత్యుత్తమ పరిణామం.

12-2-1991 కె. బాలగోపాల్